నేడు జిల్లా ఎన్నికల పరిశీలకుని రాక

కలెక్టరేట్, జనవరి 17: ఓటర్ల జాబితా జిల్లా ప్రత్యేక పరిశీలకులు, సీనియర్ ఐఏఎస్ అధికారి జె.శ్యామలరావు గురువారం జిల్లాకు రానున్నట్టు ఇన్‌ఛార్జ్ కలెక్టర్ ఎం.నవీన్ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఆయన ఈఆర్‌వోలు, ఏఈఆర్‌ఓలతో కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేకంగా సమావేశమవు తారన్నారు. ఈ నెల 22న వెలువడనున్న తుది ఓటర్ల జాబితాకు సంబంధించిన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొంటారని తెలిపారు.



జగనన్నా.. హక్కు హుళక్కేనా?

- అటకెక్కిన జగనన్న గృహ హక్కు సంపూర్ణ పథకం
- జిల్లాలో 43,093 మంది లబ్ధిదారులకు పత్రాలు
- రుణాలు ఇచ్చేందుకు మొకాలడ్డుతున్న బ్యాంకర్లు
- ప్రభుత్వం తీరుపై లబ్ధిదారుల తీవ్ర అసంతృప్తి

● టెక్కలి మండలం నర్సింగపల్లి సచివాలయానికి చెందిన ఓ మహిళా లబ్ధిదారు జగనన్న సంపూర్ణ గృహహక్కు పథకం డాక్యుమెంట్ల తో మండల కేంద్రంలోని ఓ బ్యాంక్‌వద్దకు వెళ్లింది. తనఆర్థిక అవసరాల కోసం రుణం ఇవ్వాలని బ్యాంక్ మేనేజర్‌ను కోరింది. ఆ డాక్యుమెంట్లు చూసిన బ్యాంక్ అధికారి దీనిపై రుణం ఇవ్వడం సాధ్యపడదని చెప్పడంతో ఆ మహిళ కంగుతింది.

(టెక్కలి)

ఇదీ జగనన్న సంపూర్ణ గృహహక్కు పథకం లబ్ధిదారుల పరిస్థితి. జిల్లాలో 30 మండలాలు.. నాలుగు మున్సిపాల్టీల పరిధిలో 43,093 మంది లబ్ధిదారులు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ పేరిట గ్రామ, వార్డు సచివాలయ అధికారులకు డబ్బులు చెల్లిం చారు. 2011కి ముందు ఇళ్ల కాలనీలు నిర్మించిన వాటిపై వైసీపీ ప్రభుత్వం ఓటీఎస్ ఆశలు రేకెత్తించింది. కొందరికి పది రూ పాయలు, మరి కొందరు రూ.10వేలు చెల్లిస్తే చాలు.. లబ్ధిదారులకు ఆ ఇంటిపై సర్వహక్కులు కల్పిస్తామంటూ అధికారపార్టీ ప్రజాప్రతినిధులు, పలు శాఖల అధికారులు, గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ఊదరగొట్టారు. అర్హులైన 1,53727 మంది లబ్ధిదారులను గుర్తించారు. వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కోసం గ్రామ సచివాలయ సిబ్బందికి లక్ష్యాలు కూడా నిర్దేశించారు. లబ్ధిదారులు ఓటీఎస్‌కు ఒప్పుకునేలా వలంటీర్లచే ఒత్తిడి కూడా చేయించారు. మండలాల్లో వీటి పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను సైతం నియమించారు. జిల్లా వ్యాప్తంగా 43,093మంది లబ్ధిదారులకు ఓటీఎస్ కింద జగనన్న సంపూర్ణ గృహహక్కు పథకం కింద డాక్యుమెంట్లను అందజేశారు.

ఎన్నెన్నో ఆర్భాటాలు..

ఈ పథకం వల్ల లబ్ధిదారుల ప్రయోజనాలు కావాల్సినన్ని చెబుతూ ఊరూవాడా అధికార పార్టీ ప్రజాప్రతినిధులు విస్తృత ప్రచారం చేశారు. లబ్ధిదారులకు తమ ఇంటిపై సర్వహక్కులు కల్పించబడతాయని ఆశలు రేకెత్తించారు. హక్కులు పొందిన తరువాత ఆ ఇంటిని అమ్ముకోవడం, వారసత్వంగా ఇచ్చుకోవడం, బహుమతిగా ఇచ్చుకోవడానికి కూడా అవకాశం ఉందని తెలిపారు. కుటుంబ ఆర్థిక అవసరాలు కోసం బ్యాంకుల వద్ద తనఖాపెట్టి రుణం పొందవచ్చునని, ఈ పథకం కింద పొందినపట్టా ద్వారా క్రయవిక్రయాలకు ఏవిధమైన లింకు డాక్యుమెంట్లు అవసరం లేదని ప్రభుత్వం కూడా చెప్పింది. లబ్ధిదారులకు సంబంధించి స్థిరాస్తిని గతంలో ఉన్న 22ఏ నిబంధనల నుంచి తొలగించబడుతుందని, దీనిమూలంగా లబ్ధిదారులు ఎలాంటి లావాదే వీలు అయినా చేసుకోవచ్చునని, నామమాత్రపు రుసుముతో గ్రామ, వార్డు సచివాలయ పరిధిలో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చునని, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లనవసరం లేదని ప్రచారం చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకేసి ఈ ఓటీఎస్ కింద లబ్ధిదారులకు సంబంధించి యూజర్ చార్జీలు, రిజిస్ట్రేషన్ ఫీజు, స్టాంప్ డ్యూటీలు మినహాయిస్తున్నట్లు ప్రకటించింది. 3 కేటగిరీలు కింద విభజించి గ్రామీణ ప్రాంత లబ్ధిదా రులకు రూ.10వేలు, మున్సిపాల్టీ పరిధిలోని వారికి రూ.15వేలు చెల్లిస్తే పూర్తిహక్కులు పొందేందుకు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు పొందుతారని ప్రకటించారు. ఇంటి స్థల పత్రాలను వారి పేర్లతో రిజిస్ట్రేషన్ చేసి మరీ ఇస్తామని ప్రభుత్వం జగనన్న సంపూర్ణ గృహహక్కు పథకం పేరిట విస్తృత ప్రచారం చేసింది.



లబ్ధిదారులకు అందించిన ఓటీఎస్ పత్రం

తర్వాత ఏం జరిగిందంటే..

బ్యాంకర్లు మొకాలడ్డుతుండడంతో ఏమి చేయాలో తోచక లబ్ధిదారులు తలలు పట్టుకుంటున్నారు. జిల్లాలో ఆమదాలవ లస మండలం, మున్సిపాల్టీ కలిపి 1,019 మంది, బూర్జలో 1,015 మంది, ఎచ్చెర్లలో 2,413, జి.సిగడాంలో 1,510, గారలో 1,896, హిరమండలంలో 1,153, ఇచ్ఛాపురం మండలం, మున్సిపాల్టీ కలిపి 898, జలుమూరులో 1,297, కంచిలిలో 1,582, కవిటిలో 1,016, కోటబొమ్మాళిలో 1,453, కొత్తూరులో 1,631, ఎల్ఎన్‌పేటలో 890, లావేరులో 1,860, మందసలో 1,516, మెళియాపుట్టిలో 1,648 మంది లబ్ధిదారులు ఓటీఎస్ కింద గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి డబ్బులు చెల్లించారు. నందిగాం మండలంలో 1,545 మంది, నరసన్నపేటలో 1,424, పలాస మున్సిపా ల్టీ, రూరల్ కలిపి 1,205, పాతపట్నంలో 1,767, పోలాకిలో 1,079, పొందూరులో 1,116, రణస్థలంలో 2,047, సంతబొమ్మాళిలో 1,417, సారవకోటలో 1,890, సరుబుజ్జిలిలో 905, సోంపేటలో 1,179, శ్రీకాకు ళం రూరల్, పట్టణం 2,285, టెక్కలిలో 1,286, వజ్రపుకొత్తూరులో 1,191 మంది లబ్ధిదారులు డబ్బులు చెల్లించారు. మొత్తంగా రూ. 17,40,22,900 కట్టారు. ఓటీఎస్ కింద కొందరు పది రూపాయలు, మరికొందరు పదివేల రూపాయలు చెల్లించినప్పటికీ జగనన్న సంపూర్ణ గృహహక్కు పథకం డాక్యుమెంట్లు నిరుపయోగం కావడంతో ఆందోళనకు గురవుతున్నారు. కుటుంబ ఆర్థిక అవసరాలకు బ్యాంకుల్లో తాకట్టు పెట్టుకునే అవకాశం అంటూ విస్తృత ప్రచారం చేసిన ప్రభుత్వం.. ఆ తరువాత బ్యాంకర్లు మోకాలడ్డుతున్నా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● ఈ విషయమై గృహనిర్మాణశాఖ పీడీ నక్క గణపతిరావు వద్ద ప్రస్తావించగా జిల్లాలో 1,53,728 మంది లబ్ధిదారులు ఉండగా 43,093 మంది రూ.17.4 కోట్లు చెల్లించారని, ఇంకా ఓటీఎస్ కింద వసూలు చేయాల్సి ఉందని తెలిపారు.

ఉండలేక.. వెళ్లలేక!



దాసుపురం నిర్వాసిత గ్రామం

● పాత ఇళ్లలో ఆఫ్‌షోర్ నిర్వాసితుల కష్టాలు ● బిక్కుబిక్కుమంటూ జీవనం ● ప్యాకేజీ కోసం ఏళ్ల తరబడి నిరీక్షణ



● మెళియాపుట్టి మండలం దాసుపురం గ్రామానికి చెందిన సవర మల్లీశ్వరి భర్త నాలుగేళ్ల కిందట కన్నుమూశాడు. ప్రస్తుతం ఆమె తన ఇద్దరు పిల్లలతో కలసి ఎప్పుడు కూలుతుందో తెలియని పాత ఇంటిలో బిక్కుబిక్కుమంటూ జీవిస్తోంది. వీరిది ఆఫ్‌షోర్ నిర్వాసిత గ్రామం. కానీ ఈ కుటుంబానికి పరిహారం అందలేదు. కొత్త ఇంటి నిర్మాణానికి ప్యాకేజీ రాకపోవటంతో బీటలు వారిన ఇంటిలో నివాసం ఉంటున్నారు. 'సర్వే సమయంలో మేం గ్రామంలో లేకపోవడంతో పరిహారం మంజూరు కాలేదని అధికారులు చెబుతున్నారు. ఎన్నిసార్లు తిరుగుతున్నా ప్రయోజనం లేదని మల్లీశ్వరి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



● అదే గ్రామానికి చెందిన సవర సోంబారమ్మకు ముగ్గురు కుమారులు ఉన్నారు. వీరిలో ఒక్కరికి మాత్రమే ప్యాకేజీ రావడంతో మిగిలిన వారు పాత ఇంటిలోనే నివాసం ఉంటున్నారు. ఆ ఇల్లు ఎప్పుడు కూలుతోందోనని ఆందోళనతో గడుపుతున్నారు. మిగిలిన వారికీ ప్రయోజనాలు కల్పించాలని వేడుకుంటున్నారు.



● అదే గ్రామానికే చెందిన సవర దేవికమ్మకు ప్యాకేజీ వచ్చిన ప్పటికీ పునరావాస కాలనీలో ఇల్లు మంజూరు చేయలేదు. ఆమె కూడా పాత ఇంటిలోనే నివాసం ఉంటున్నానని చెబుతున్నారు. ఆ ఇంటిలో ఎప్పుడు ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

..ఇవీ ఆఫ్‌షోర్ నిర్వాసిత గ్రామాల్లోని కుటుంబాల కష్టాలకు మచ్చుతునకలు.

మెళియాపుట్టి, జనవరి 17

మహేంద్ర తనయ నదిపై నిర్మిస్తున్న ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులకు 2008లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో శ్రీకారం చుట్టారు. దీని కారణంగా నిర్వాసితులైన వారిలో కొంతమందికి ప్రభుత్వం నుంచి పరిహారం అందగా...మరికొందరికి రకరకాల సర్వేల పేరుతో ఇప్పటి వరకూ ఎటువంటి సాయమూ అందలేదు. దాసుపురం, చీపురుపల్లి గ్రామాలకు సంబంధించి 130 మంది నిర్వాసితులకు ప్యాకేజీ రాలేదు. వీరంతా పాత ఇళ్లలో ఉండలేక... కొత్త ఇళ్లు నిర్మించలేక... భవిష్యత్తు ఏమిటో తెలియక ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే వీరిలో అనేక మందికి చెందిన ఇళ్లు కూలటానికి సిద్ధంగా ఉన్నాయి. ప్యాకేజీ వచ్చిన వారిలో కొందరు గ్రామాలు వదిలి పునరావాస గ్రామాలకు వెళ్లారు. మిగిలిన 130 మంది మాత్రం ఏ సాయమూ అందక పాత ఇళ్లలోనే నెట్టుకొస్తున్నారు.

జగనన్నా.. హామీ ఏమైంది?

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్న సమయంలో ఆఫ్‌షోర్ నిర్వాసితులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. 2013 ప్యాకేజీతో పాటు యూత్ ప్యాకేజీ ఇస్తానని హామీ ఇచ్చారు. యూత్ ప్యాకేజీ మాట అటుంచితే... కనీసం ఉన్న కుటుంబాలకు కూడా ప్రయోజనం కనిపించలేదని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అందని పరిహారం...

చీపురుపల్లి, దాసుపురం నిర్వాసిత గ్రామాలకు జీవో నెంబర్ 460 ప్రకారం యూత్ ప్యాకేజీ ఇవ్వవలసి ఉంది. దీనితో పాటు ప్రభుత్వ ప్యాకేజీలో ఇంటి స్థలం పొందిన వారికి రూ. 9.91 లక్షలు... స్థలం వద్దనుకున్న వారికి రూ. 11.35 లక్షలు ఇచ్చారు. డీ పట్టా భూములకు, దేవాలయాలకు, చేపల చెరువులకు నష్టపరిహారం అందించవలసి ఉందని చెబుతున్నారు.

వాహనాలను చూపి బిల్లులు..

2022 బడ్జెట్‌లో ఆఫ్‌షోర్‌కు రూ.885 కోట్లు కేటాయించారు. గతంలో పనులు చేసిన కాంట్రాక్టర్‌ను తప్పించి... శ్రీసాయిలక్ష్మీ కన్‌స్ట్రక్షన్ కంపెనీకి జీవో నెంబర్ 365 ప్రకారం పనులు అప్పగించారు. అంచనాలు సవరించి.. రూ. 466.28 కోట్లతో పనులు చేస్తున్నట్టు చెబుతున్నారు. కానీ ఎక్కడా పనులు జరుగుతున్న పరిస్థితి కనిపించడం లేదు. పనులు చేపట్టవలసిన ప్రదేశాలలో పాత లారీలు.. ఎక్స్‌కవేటర్లు నిలబెట్టి.. బిల్లులు చేసుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. త్వరలో ఎన్నికలు రానున్నాయి. ఈ సమయంలో నిర్వాసితుల నిరీక్షణ ఎంతవరకు ఫలిస్తుందో... పనులు ఏ మేరకు ముందుకు కదులుతాయో చూడాలి.

నివేదికను కలెక్టర్ పంపాం..

ఆఫ్‌షోర్ నిర్వాసితుల నుంచి వచ్చిన దరఖాస్తుల మేరకు సర్వే చేసి సంబంధిత జాబితాను జిల్లా కలెక్టర్‌కు నివేదించాం. తదుపరి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

-వైకుంఠరావు, ఆర్ఐ

పొర్లుదండాలు.. సాష్టాంగ నమస్కారాలు

శ్రీకాకుళంలో నిరసన తెలిపిన అంగన్వాడీ సిబ్బంది

● జిల్లాలో కొనసాగుతున్న ఆందోళనలు



శ్రీకాకుళంలో అంగన్‌వాడీ సిబ్బంది నిరసన



ఇచ్ఛాపురంలో..

అరసవల్లి, జనవరి 17: అంగన్వాడీల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ అంగన్వాడీలు శ్రీకాకుళంలోని జ్యోతిబాపూలే పార్కు వద్ద పొర్లుదండాలు చేస్తూ.. సాష్టాంగ నమస్కారం చేస్తూ కనికరించండి మహాప్రభో అంటూ బుధవారం వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి పి.తేజేశ్వరరావు, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.కృష్ణమూర్తి మాట్లాడుతూ పెంచిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచకపోతే అంగన్వాడీలు ఎలా జీవనం సాగించాలని ప్రశ్నించారు. గత 37 రోజులుగా అంగన్వాడీలు తమ న్యాయమైన డిమాండ్ల కోసం సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించు కోకుండా వ్యవహరించడం సమర్థనీయం కాదన్నారు. తెలంగాణ కన్నా వెయ్యి రూపాయల ఎక్కువ వేతనం చెల్లిస్తామన్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఆర్.ప్రకాష్, సీహెచ్ అరుణ, వై.లీలారత్నకుమారి, డి.ముత్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురంలో..

ఇచ్ఛాపురం, జనవరి 17: ఇచ్ఛాపురంలో బుధవారం 36వ రోజు అంగన్వాడీ ఉద్యోగులు ఆందోళన కొనసాగించారు. బస్టాండ్ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన శిబిరం వద్ద ఎండలోనే నిరసన తెలిపారు. 'మా సమస్యలు పరిష్కరించు జగన్' అంటూ నినాదాలు చేశారు. ముక్కనుమ పండుగ నాడు ఇంటికి కూతుర్లు, అల్లుళ్లు వచ్చినా వారిని వదిలి దీక్షల్లో పాల్గొన్నారు.



విశాఖపట్నం నాన్‌స్టాప్ కౌంటర్ల వద్ద బారులు తీరిన ప్రయాణికులు

తిరుగు ప్రయాణం

● ఆర్టీసీ కాంప్లెక్స్‌లో రద్దీ

శ్రీకాకుళం క్రైం, జనవరి 17: సంక్రాంతి పండుగ మూడు రోజులు సెలవుల అనంతరం విద్యార్థులు, ఉద్యోగులు, వలస కూలీలు తిరుగు పయనమయ్యారు. దీంతో బుధవారం నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ రద్దీగా కనిపించింది. శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం, విజయవాడ వరకు వెళ్లే బస్సులు కిక్కిరిసి పోయాయి. కొందరు గమ్యస్థానానికి వెళ్లే బస్సుల కోసం గంటల తరబడి కాంప్లెక్స్‌లో పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఇక విశాఖపట్నం నాన్‌స్టాప్ రిజర్వేషన్ కౌంటర్‌లో ప్రయాణికుల అవస్థలు వర్ణనాతీతం. చిన్నపిల్లలతో వచ్చిన వారు టిక్కెట్ కోసం క్యూలైన్లో గంటల తరబడి నిలబడ్డారు. మరికొందరైతే క్యూలైన్లను చూసి తిరిగి ఇంటి ముఖం పట్టారు.



వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన మూలపేట నాయకులు

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

● రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు సమక్షంలో..

కోటబొమ్మాళి/టెక్కలి, జనవరి 17: నియోజకవర్గంలో పలు పంచాయతీల వైసీపీ వార్డు మెంబర్లు బుధవారం టీడీపీలో చేరారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు నిమ్మాడలోని తన క్యాంపు కార్యాలయంలో వారికి పార్టీ కండువావేసి పార్టీలోకి ఆహ్వానించారు. చేరిన వారిలో లఖందిడ్డి పంచాయతీ మూలపేట గ్రామానికి చెందిన వార్డు మెంబరు మూల సింహాచలం, బమ్మిడి ఉత్తరరావు, బమ్మిడి కృష్ణ, గురువెల్లి చలపతితో పాటు 50 కుటుంబాలు ఉన్నాయి. అలాగే కొత్తపల్లి పంచాయతీ గ్రామ వలంటీరు వాన ప్రవీణ్, వార్డు మెంబర్ వెలమల వెంకటరావు కూడా టీడీపీలో చేరారు. నందిగాం మండలం కాపు తెంబూరు పంచాయతీ నుంచి వైసీపీ నాయకులు మాలపల్లి నారాయణరావు, మలగాం లక్ష్మీకాంతం, మాలపల్లి లక్ష్మణరావు, తేజసర్వరరావు, కుమ్మరి తిమ్మయ్యతో పాటు 50 కుటుంబాల వారు టీడీపీలో చేరారు.

అసోం చీఫ్ సెక్రటరీగా సిక్కోలు వాసి



కోట రవి

టెక్కలి, జనవరి 17: అసోం రాష్ట్ర చీఫ్‌సెక్రటరీగా సీనియర్ ఐఏఎస్ అధికారి కోట రవిని అక్కడ రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఏప్రిల్ 1 నుంచి ఈయన బాధ్య తలు చేపట్టనున్నారు. ఈయన 1993 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. ఈయన స్వగ్రామం శ్రీకా కుళం జిల్లా సంతబొమ్మాళి మండలం కోటపాడు గ్రామం. ఈయన విద్యాభ్యాసమంతా ప్రభుత్వ పాఠశాలలు, టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగింది. అసోంలోని గోసాయిగాం అసిస్టెంట్ కలెక్టర్‌గా, శివసాగర్, జార్హాట్, జోలాగాట్ జిల్లా కలెక్టర్‌గా పనిచేశారు. అలాగే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, పాండిచ్చేరి, అండమాన్ ప్రాంతాలకు సంబంధించి ఎఫ్‌సీఐ సీని యర్ రీజనల్ మేనేజర్‌గా కూడా పనిచే శారు. 15వ ఆర్థిక సంఘం జాయింట్ సెక్రటరీగా, అప్పటి గనులశాఖ, మానవ వనరులశాఖ మంత్రులకు ఓఎస్‌డీగా పనిచేశారు. అలాగే అమెరికాలో మినిస్ట్రీ ఆఫ్ ఎకనమిక్స్ తరపున మన దేశం నుంచి మూడు సంవత్సరాలు ప్రాతినిధ్యం వహించారు. ఇటీవల అసోం ప్రభుత్వం తరఫున ఉల్ఫా తీవ్రవాదులతో జరిగిన శాంతి ఒప్పందం చర్చల్లో కూడా ఆయన పాల్గొన్నారు.

బీఆర్ఏయూ వీసీగా ప్రొఫెసర్ రజని



ప్రొఫెసర్ కేఆర్ రజని

ఎచ్చెర్ల, జనవరి 17: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీగా ఆంధ్రా యూనివర్సిటీ విశ్రాంత ప్రొఫెసర్ కేఆర్ రజనిని నియమిస్తూ గవర్నర్ అబ్దుల్ నజీర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈమె కృష్ణా జిల్లా తిరువూరు మండలం మల్లెల గ్రామం వాసి. ఈమె ఏయూలోని ఫిలాసఫీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా 1994లో చేరారు. తర్వాత అసోసియేట్ ప్రొఫెసర్‌గా 2000- 2008వరకు, ప్రొఫెసర్‌గా 2008-2019 వరకు పనిచేసి పదవీ విరమణ చేశారు. కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ పరిధిలోని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫిలాసిఫికల్ రీసెర్చ్ (ఐసీపీఆర్)కు సీనియర్ ఫెలోగా, జేఎన్‌టీయూ (విజయనగరం) పాలకమండలి సభ్యురాలుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈమె గైడెన్స్‌లో 18 మంది పీహెచ్‌డీ అవార్డు అందుకోగా, మరో 8 మంది రీసెర్చ్ చేస్తున్నారు. 2008లో ఏర్పాటైన ఈ వర్సిటీకి ఇప్పటి వరకు నలుగురు రెగ్యులర్ వీసీలు పనిచేశారు. కేఆర్ రజని బీఆర్ఏయూకు ఐదో వీసీగా నియమితులయ్యారు. అంబేడ్కర్ వర్సిటీకి ఇప్పటి వరకు ప్రొఫెసర్ ఎస్వీ సుధాకర్, ప్రొఫెసర్ హనుమంతు లజపతిరాయ్, ప్రొఫెసర్ కూన రాంజీ, ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు రెగ్యులర్ వీసీలుగా పనిచేశారు.

21 వరకు ఇన్‌చార్జ్ కలెక్టర్‌గా ఎం.నవీన్

కలెక్టరేట్, జనవరి 17: కలెక్టర్ శ్రీకేష్ లాఠ్కర్ ఈ నెల 21వ తేదీ వరకు సెలవులో ఉన్నందున, అంతవరకు ఆయన స్థానంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌కు ఇన్‌చార్జి కలెక్టర్‌గా బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు.



లారీలో ప్రమాదకర స్థితిలో తీసుకువెళుతున్న బండరాళ్లు

ప్రమాదకరం

చిత్రం చూస్తున్నారుగా.. ఎంత ప్రమాదకరంగా బండరాళ్లను తరలిస్తున్నారో.. ఇది హిరమండలం వద్ద జరుగుతున్న వంశధార రిజర్వాయర్ నిర్మాణ పనులకు సమీపంలోని నౌగూడ క్వారీ నుంచి పెద్ద పెద్ద బండరాళ్లను భారీ వాహనాల్లో తరలిస్తున్నారు. అయితే ఎటువంటి భద్రతా చర్యలు తీసుకోక పోవడంతో తరచూ బండరాళ్లు వాహనాల్లో నుంచి పడి ప్రమాదాలు సంభవిస్తున్నాయి. వాహనానికి కనీసం డోర్ కూడా లేకపోవడంతో బండరాయి ఎప్పుడు పడుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. వెనుక నుంచి ఏవైనా ద్విచక్ర వాహనాలు గాని ఇతర వాహనాలు వచ్చినా ప్రమాదాలు జరిగే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాద నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. -హిరమండలం

పూర్తయ్యేదెప్పుడో?

పలాస మండలం సున్నాదేవి గ్రామానికి వెళ్లే రోడ్డు నిర్మాణం పూర్తి కాకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. జాతీయ రహదారి నుంచి ఎల్‌సీ గేటు మీదుగా గ్రామానికి వెళ్లే సుమారు కిలోమీటరు రోడ్డు నిర్మాణానికి గతంలో మెటల్ వేసి వదిలేశారు. దీంతో పాదచారులు, వాహనచోదకులు పడుతున్న ఇక్కట్లు అన్నీ ఇన్నీ కావు. పనులను ఇదిగో వేస్తాం.. అదిగో వేస్తామని చెబుతున్నా ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. -పలాస రూరల్



సున్నాదేవికి వెళ్లే రోడ్డు దుస్థితి..



కేరాశింగి వద్ద వృథాగా వదిలేసిన సిమెంటు బస్తాలు

నిరుపయోగం

చిత్రంలో చూస్తున్నారుగా.. సిమెంట్ బస్తాలు ఇలా వృథాగా వదిలేశారు.. గడచిన రెండేళ్లుగా వీటిని వదిలేయడంతో గడ్డ కట్టి ప్రజాధనం వృథా అయింది. కేరాశింగి గ్రామానికి రూ.2.50 కోట్లతో రోడ్డు పనులు చేపట్టడం తెలిసిందే. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత పనులు ప్రారంభించారు. దీనిలో భాగంగా సిమెంట్ బస్తాలు సదరు ప్రాంతంలో వేశారు. కొంతమేర పనులు ప్రారంభించి మధ్యలో వదిలేశారు. అప్పటి నుంచి ఈ బస్తాలు అక్కడే పడి ఉన్నాయి. ఇప్పటి వరకు పనులు పూర్తి చేయలేదు. దీంతో ఎండకు ఎండి, వానకు తడిచి సిమెంట్ గడ్డకట్టుకుపోయింది. -మెళియాపుట్టి

ఇరుగ్గా మలుపు

బెండిగేటు జంక్షన్ వద్ద పూండి వేళ్లే రోడ్డు మలుపు ఇరుకుగా ఉండడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. బెండి వంతెనకు పక్కనే రోడ్డును ఏర్పాటు చేయడంతో పాటు ఇరుకుగా ఉండడంతో ఎదురుగా వచ్చే వాహనాలు ఢీకొంటున్నాయని పేర్కొంటున్నారు. పూండి మార్కెట్‌కు నిత్యం ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. భారీ వాహనాలు సైతం ఇదే మార్గంలో వస్తుంటాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకుని మలుపు వద్ద రోడ్డు విస్తరించి ప్రమాదాలను నివారించాలని స్థానికులు కోరుతున్నారు. -వజ్రపుకొత్తూరు



బెండి గేటు జంక్షన్ వద్ద ఇరుకుగా ఉన్న రోడ్డు

ప్రజా భాగస్వామ్యంతో పల్లెల అభివృద్ధి

● ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా



మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా

కోటబొమ్మాళి: ప్రజా భాగస్వామ్యంతోనే పల్లెలు అభివృద్ధి చెందుతాయని ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో జీపీడీపీపై మండల స్థాయి శిక్షణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు వారా ల పాటు ఎంపీడీవో విధులను తెలుసుకొనేందుకు ఇక్కడకు వచ్చినట్లు తెలిపారు. పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక బడ్జెట్లను తయారు చేసుకోవాలన్నారు. ముఖ్యంగా ఉపాధి కల్పన, ఆర్థిక ప్రణాళిక తదితర కమిటీల ద్వారా గ్రామసభలు ఏర్పాటు చేసి పల్లెలను అభివృద్ధి చేసుకో వాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీ డీవో బి.రామారావు, కార్యాలయ ఏవో సంపతిరావు రాజేశ్వరమ్మ, కార్యదర్శులు ఎన్.ఎన్. చైతన్య, బి.నరేష్, ఏఎంసీ చైర్మన్ బొడ్డు వెంకటరమణ, చిట్టివలస సర్పంచ్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. ● **ఎల్.ఎన్.పేట:** గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేసేందుకు వార్డు సభ్యులు, సొసైటీల ప్రతినిధులు, ఉత్సాహ వంతులైన యువకులతో కమిటీలను ఏర్పాటు చేయాలని ఎంపీడీవో ఆర్.కాళీ ప్రసాదరావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో పంచాయతీల అభివృద్ధి పనులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భగా అయన మాట్లాడుతూ.. పంచాయతీల్లో కనీస మౌలిక సదుపాయాలు ఏర్పాటవ్వాలంటే తప్పనిసరిగా బాలసభ, మహిళాసభ తదితర కమిటీలను ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆర్.జ్యోతిలక్ష్మి, జడ్పీటీసీ కె.త్రినాథులు, పీఏసీఎస్ అధ్యక్షుడు కె.కృష్ణారావు, ఈవోపీఆర్డీ ఐ.పద్మజ, ఎంఈవో మణికుమార్ తదితరులు పాల్గొన్నారు. ● **నందిగాం:** ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగడం ద్వారా పంచాయతీలను అభివృద్ధి చేసుకోవచ్చని ఎంపీపీ నడుపూరు శ్రీరామ్మూర్తి అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు శిక్షణా తరగతులు నిర్వహించారు. రీసోర్స్‌పర్సన్లు కె.సంతోష్ కుమార్, సీహెచ్ ఢిల్లేశ్వరరావు వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో టి.రాజారావు, వైస్ ఎంపీపీలు ఎస్.వసంతకుమార్, ఆర్.లక్ష్మీకాంతం, పీఏసీఎస్ అధ్యక్షుడు కె.బాల కృష్ణారావు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. ● **పాతపట్నం:** ప్రణాళికలతో పంచాయతీల అభివృద్ధి సాధ్యమని ఎంపీఈవో పేడాడ జయంత్ ప్రసాద్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈవోపీఆర్డీ కృష్ణారావు మాట్లాడుతూ.. సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయా లన్నారు. కార్యాలయ సూపరింటెండెంట్ రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన అంగన్‌వాడీల నిరసన



సరుబుజ్జిలి: సంతకాలు సేకరిస్తున్న దృశ్యం

టెక్కలి రూరల్: టెక్కలిలో అంగన్‌వాడీల నిరసన కార్యక్రమాలు బుధవారం కూడా కొనసాగాయి. తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో టెక్కలి, నందిగాం మండలాలకు చెందిన అంగన్‌వాడీ సిబ్బంది ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. న్యాయమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇటీవల అంగన్‌వాడీ కార్యకర్తలకు టెక్కలి ఐసీడీఎస్ అధికారులు జారీ చేసిన షోకాజ్ నోటీసులకు కార్యాలయ అధికారులకు లిఖితపూర్వక వివరణను అందజేశారు. ● **సరుబుజ్జిలి:** గత 36 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు కోటి సంతకాల సేకరణతో బుధవారం నిరసన తెలిపారు. ఎన్ని విధాలుగా నిరసన తెలియజేసినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని మండిపడ్డారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ఇంటింటికీ వెళ్లి సంతకాలు సేకరించారు.

సేవాభావం కలిగి ఉండాలి



వస్త్రాలను పంపిణీ చేస్తున్న సంఘ నేతలు

టెక్కలి: సమాజంలో ప్రతిఒక్కరూ సేవా భావం కలిగి ఉండాలని టెక్కలి పట్టుశాలీ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు దుంపా లోకేశం అన్నారు. భావనా మహర్షి జయంతి వేడుక సందర్భంగా బుధ వారం స్థానిక అక్కపు వీధిలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. రిటైర్డ్ ఇంజినీర్ పమ్మిన సింహాచలం దంపతులు నిరుపేదలకు వస్త్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు మల్లిపెద్ది మధు, కార్యదర్శి దుంపా శ్రీనివాస్, దున్న సాంబశివరావు, బస్వా శ్యామసుందరరావు పాల్గొన్నారు.

నిరుపేదలకు వస్త్రాల పంపిణీ



నిరుపేదలకు నూతన వస్త్రాలను అందిస్తున్న కొర్ల కన్నారావు, కవిత

మందస: మందస గాయత్రీ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బీజేపీ నాయకుడు కొర్ల కన్నారావు, మాజీ ఎంపీపీ కొర్ల కవిత ఆధ్వర్యంలో వీవీఆర్‌పురంలో బుధవారం నిరుపేదలకు వస్త్రాల పంపిణీ చేశారు. కొర్ల కళావతి జ్ఞాపకార్థం 20 ఏళ్లుగా సేవా కార్యక్రమాలు చేస్తున్నామని వారు తెలిపారు. కార్య క్రమంలో మార్పు వెంకటేశం, జి.చక్రపాణి, కె.సురేష్, కె.ఆనందరావు, జగదీష్‌పండా, ఖగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఫ్లెక్సీలు చించివేత

పలాసరూరల్: కిష్టుపురం గ్రామంలో స్థానిక టీడీపీ నేతలు ఏర్పాటు చేసిన భవిష్యత్తుకు గ్యారెంటీ ఫ్లెక్సీలను గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి చించివేశారు. ఓర్వలేకనే తమ పార్టీకి చెందిన ఫ్లెక్సీలను చింపి వేస్తున్నారని, ఇటువంటి సంస్కృతి మంచిది కాదని టీడీపీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.



కిష్టుపురంలో చించివేసిన టీడీపీ ఫ్లెక్సీ

ముగిసిన సంక్రాంతి సంబరాలు

- తిరుగుముఖం పట్టిన ఉద్యోగులు, వలస కూలీలు
- మాంసం, మందు దుకాణాల వద్ద జనం బారులు



పాతపట్నం: బస్సు ఎక్కేందుకు సిద్ధపడుతున్న ప్రయాణికులు



నరసన్నపేటలో మాంసం దుకాణం వద్ద జనం

నరసన్నపేట: సంక్రాంతి సంబరాలు బుధవారం ముక్కనుమతో ముగిశాయి. కొత్త అల్లుళ్లతో గ్రామాలు కళకళలాడాయి. ఆడ పిల్లలకు ముక్కు కుట్టే ఉత్సవాలు జరిపారు. గ్రామాల్లో ఆటపాటలతో చిన్నారులు అదరగొట్టారు. గాలిపటాలను ఏగురవేసి ఆనందం పొందారు. ముక్కనుమ సందర్భంగా మాంసం, మందు దుకాణాల వద్ద ప్రజలు ఎగబడ్డారు. అధిక ధరలకు మాంసం, చేపలను కొనుగోలు చేశారు. సంక్రాంతి సంబరాలు ముగియడంతో ఇతర ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు వచ్చిన వారంతా తిరుగుముఖం పట్టారు. జమ్ము, కంబాకాయి, మాకి వలస, ఉర్లాం, నడగాం, చోడవరం, సుందరాపురం తదితర గ్రామాల్లో ముక్కనుమ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

ప్రయాణికులతో బస్సుల కిటకిట

స్వగ్రామాల నుంచి ఉద్యోగులు విధి నిర్వహణకు, వలస పక్షులు పనుల నిమిత్తం వెళ్లేందుకు బయ లుదేరడంతో బస్సులు కిటకిటలాడాయి. నరసన్నపేట ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ వెళ్లే బస్సులకు ప్రయాణికులు ఎగబడ్డారు. సుదూర ప్రాంతాలకు వెళ్లే వారు బస్సులు లేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉర్లాం, తిలారు రైల్వేస్టేషన్లు ప్రయాణికులతో కిటకిట లాడాయి.

ప్రయాణికుల అవస్థలు

నందిగాం: సంక్రాంతి పండగ ముగియడంతో తిరుగు ప్రయాణంలో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. స్వగ్రామాలకు వచ్చిన వారంతా తిరుగుముఖం పట్టడంతో పాటు కన్న వారింటికి వచ్చిన కొత్త జంటలు వారి గ్రామాలు, పట్టణాలకు వెళ్లేందుకు బస్సులు సకాలంలో రాకపోవడంతో పలు కూడళ్లలో ప్రయాణికులు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. నందిగాం, పెద్దతామరాపల్లి, నర్సిపురం జంక్షన్, కొండతెంబూరు, కాపుతెంబూరు జంక్షన్ తదితర ప్రాంతాల్లో ప్రయాణికులు వేచి ఉండడం కనిపించింది.

తిరుగు ప్రయాణికుల నిరీక్షణ

పాతపట్నం: సంక్రాంతి పండగ నేపథ్యంలో దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు తిరుగు ప్రయాణంతో బస్సులు కిటకిటలాడాయి. ప్రధాన కూడళ్లలో గంటల తరబడి ప్రజలు నిరీక్షించాల్సి వచ్చింది. శ్రీకాకుళానికి చెందిన ఆర్టీసీ బస్సు మొరాయించడంతో ప్రయాణికులకు ఇబ్బంది తప్పలేదు.

చల్లవానిపేట కూడలిలో ట్రాఫిక్ జాం

జలుమూరు: సంక్రాంతి సందర్భంగా సుదూర ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు వచ్చి తిరిగి వెళ్లేందుకు వాహ నాల్లో ప్రయాణం కాగా చల్లవానిపేట కూడలిలో వాహనాలు నిలిచి పోయి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ప్రయాణికులతో రైల్వేస్టేషన్లు, బస్ కాంప్లెక్సులు కిటకిటలాడాయి.



నందిగాం సర్వీస్ రోడ్డులో బస్సుల కోసం వేచివున్న ప్రయాణికులు



పాతపట్నంలో మొరాయించిన బస్సును తోస్తున్న దృశ్యం

బాబుతోనే యువతకు భవిష్యత్తు

జలుమూరు: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రంలోని యువత భవిష్యత్తుకు గ్యారెంటీ లభిస్తుందని ఆ పార్టీ యూనిట్ ఇన్‌చార్జి బోడేల బాలకృష్ణ అన్నారు. రామయ్యవలస గ్రామంలో బుధ వారం బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైసీపీ వైఫల్యాలను, టీడీపీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నేతలు గొద్దు రమణమూర్తి, మొయ్యి శ్రీనివాసరావు, సింహాచలం, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు. ● **జలుమూరు (సారవకోట):** వైసీపీ పాలనలో రాష్ట్రం రావణకాష్టంగా మారిందని టీడీపీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ అన్నారు. కరడసింగి జగన్నాథపురంలో బుధవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించడం ద్వారా చంద్ర బాబును సీఎంగా చేయాలని కోరారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ మేనిఫెస్టోను వివరించారు. కార్యక్రమంలో నాయకులు సాధు చిన్నికృష్ణంనాయుడు, మాజీ సర్పంచ్ బోర తాతయ్య, కుబ్బా అప్పలనాయుడు తది తరులు పాల్గొన్నారు.





రామయ్యవలస, కరడసింగి జగన్నాథపురంలో కరపత్రాలు అందిస్తున్న టీడీపీ నాయకులు

నేడు ఎన్టీఆర్ వర్ధంతి

నరసన్నపేట: ఆదివారంపేట చిల్డ్రన్ పార్కులో టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ సీఎం ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి బుధ వారం ఒక ప్రకటనలో తెలి పారు. ఉదయం 9 గంటలకు పార్కులోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించడం జరుగుతుందన్నారు. అలాగే పార్టీ కార్యాలయంలో జరిగే కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు. ● **వజ్రపుకొత్తూరు:** టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాన్ని అక్కుపల్లి, వజ్రపుకొత్తూరు, బాతుపురం గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ నేతలు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు. ● **టెక్కలి:** టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ సీఎం ఎన్టీఆర్ వర్ధంతిని గురువారం మండల కేంద్రాల్లో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు అచ్చెన్నాయుడు పొలిటికల్ పీఏ లాడి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించే కార్యక్రమం చేపట్టాలని కోరారు.

అ'పూర్వ' సమ్మేళనం

పాతపట్నం: కొరసవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999-2000 సంవత్సరాల్లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని బుధవారం నిర్వహించారు. అందరూ ఒకచోట చేరి నాటి జ్ఞాపకాలను నెమరువేసుకుని ఆనందం పొందారు. నాటి ఉపాధ్యాయులను సత్కరించి వారి ఆశీస్సులు పొందారు. అనారోగ్యంతో మృతి చెందిన విద్యార్థులకు నివాళి అర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ప్రసాదరావు, విద్యార్థులు పాల్గొన్నారు. ● **పోలాకి:** దీర్ఘాశి జడ్పీ ఉన్నత పాఠశాలలో 2003-2004లో పదో తరగతి చదివిన విద్యార్థుల సమ్మేళనం బుధవారం నిర్వహించారు. సుమారు 23 ఏళ్ల అనంతరం కలుసుకున్న వారంతా నాటి మధురానుభూతులను తెలుపుకుని ఆనందం పొందారు. నాడు విద్యాబుద్ధులు నేర్పిన 13 మంది ఉపాధ్యాయులను సత్కరించి వారి ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి సాంబమూర్తి, పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వాహకులు చిట్టి తాతబాబు, శిమ్మన్న, రమణ తదితరులు పాల్గొన్నారు. ● **కవిటి:** బొరివంక ఉన్నత పాఠశాలలో 1990-91లో టెన్త్ చదువు కున్న విద్యార్థులు, ముత్యాల పేట ఉన్నత పాఠశాలలో 2006-07లో టెన్త్ చదువుకున్న విద్యార్థులు అపూర్వ సమ్మేళనం బుధవారం నిర్వహించారు. పాత జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. చదువు చెప్పిన గురువులు పి.బాలయ్య, బి.ఉమామహేశ్వరరావు, బి.శంకర్‌రావు, రామకృష్ణలను సత్కరించారు. పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.





కొరసవాడ, బొరివంక ఉన్నత పాఠశాలల్లో విద్య నేర్పిన ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

దుర్గ్ నుంచి బరంపురం వరకు రైలు ఏర్పాటు చేయండి



వినతిపత్రం అందిస్తున్న సమితి ప్రతినిధులు

వజ్రపుకొత్తూరు: చత్తీస్‌గఢ్ రాష్ట్రం బిలాయి, దుర్గ్, రాయిపూర్ ప్రాంతాల్లో జిల్లాకు చెందిన ప్రజలు అత్యధికంగా ఉన్నందున దుర్గ్ నుంచివయా విజయనగరం మీదుగా ఒడిశా రాష్ట్రం బరం పురం వరకు కొత్త రైలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆంధ్రా ఉత్కల్ సంఘర్ష్ సమితి ప్రతినిధులు కోరారు. ఈ మేరకు బుధవారం ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే అచ్చె న్నాయుడులకు సమితి అధ్యక్షుడు ఉమాశంకర్, డోకులపాడు మాజీ సర్పంచ్ అంబటి రామకృష్ణ వినతి పత్రం అందించారు. దీనిపై ఎంపీ సానుకూలంగా స్పందించి ఈనెలలో జరగనున్న బడ్జెట్ సమావేశంలో సంబంధిత మంత్రితో చర్చిస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాస పాపారావు, పల్లేటి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా బల ప్రదర్శన పోటీలు



పాగోడులో బల ప్రదర్శన పోటీ తిలకించేందుకు వచ్చిన ప్రజలు

జలుమూరు: పాగోడు గ్రామంలో ముక్కనుమ పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లాస్థాయి బలప్రదర్శన పోటీలు నిర్వహించారు. ఉమారామలింగేశ్వరస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం వెయిట్ లిఫ్టింగ్, సంగిడీలు, ఉలవ బస్తాలు ఎత్తడం, విసురుడు గుండు తదితర బలప్రదర్శన పోటీలు నిర్వహించారు. విజేతలకు సర్పంచ్, దామ మన్మధరావు, ఎంపీటీసీ రావాడ చందనబాబు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పరిసర గ్రామాలకు చెందిన ప్రజానీకం పాల్గొని పోటీలను తిలకించారు.

క్రీడలతోనే జాతీయస్థాయిలో గుర్తింపు

జలుమూరు (సారవకోట): క్రీడలతోనే జాతీయస్థాయిలో గుర్తింపు సాధ్యమని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి అన్నారు. పురుషోత్తకర్రలో యూత్ రాక్ స్టార్ ఆధ్వర్యంలో కొంకాడ అనిత్ స్మారక వాలీబాల్ టోర్నమెంట్‌లో విజేతలకు బుధవారం బహుమతి ప్రదానం చేశారు. ఈ పోటీల్లో 20 జట్లు పాల్గొనగా టెక్కలి జట్టు ప్రథమ, పాతపట్నం జట్టు ద్వితీయస్థానం సాధించింది. కార్యక్రమంలో పలువురు యువకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

వజ్రపుకొత్తూరు: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని నగరంపల్లి టీడీపీ నాయకులు దువ్వాడ అప్పారావు, సనపల చక్రవర్తి అన్నారు. బుధవారం గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ పోస్టర్లను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాయకులు దువ్వాడ వనజనాభం, బగాది చల్లయ్య, సిస్టు మోహనరావు, ఇంద్రసేన, గణపతి, బాలకృష్ణ, మల్లేశ్వరరావు, మన్మథరావు పాల్గొన్నారు.

22న ఒడియా కళాకారుల సమ్మేళన్

మందస: బుడార్సింగి గ్రామంలో ఈనెల 22న ఆంధ్రప్రదేశ్ ఒడియా కళాకారుల మహా సంఘం ఆధ్వర్యంలో ఒడియా కళా సమ్మేళన్ నిర్వహిస్తున్నామని ఆ సంఘ సభ్యులు డాక్టర్ నల్ల తిరుపతి, అశోక్ కుమార్‌సాహు, కుమార్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. భారత్ వర్ష్ అయోధ్యలో ఈనెల 22న శ్రీరామ ప్రతిమ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా బుడార్సింగి రామమందిరం ఆవరణలో రామతారక మం త్ర జపం, హోమం, ఆధ్యాత్మిక కళా ప్రదర్శనలు ఒడియా కళాకారులతో నిర్వహిస్తున్నామన్నారు. ఉత్తమ ఒడియా కళాకారులకు సన్మానం చేయనున్నామన్నారు.

కాశీబుగ్గ రూరల్ సీఐగా ఈశ్వరరావు

పలాస: కాశీబుగ్గ రూరల్ సీఐగా పి.ఈశ్వరరావు బుధ వారం బాధ్యతలు చేపట్టారు. ఈయన పరవాడ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న జి.శంకరరావు అనకాపల్లికి బదిలీపై వెళ్లారు. ఈశ్వరరావు బాధ్యతలు స్వీకరించగా సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.

జాతరో.. జాతర

- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- జిల్లాలో ఆధ్యాత్మిక సందడి

జిల్లాలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. సంక్రాంతి నేపథ్యంలో వివిధ గ్రామాల్లో జాతర మహోత్సవాలు సందడిగా జరుగుతున్నాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేస్తున్నారు.

పోటెత్తిన జనం

నరసన్నపేట: రెడ్డికపేటలోని హాలహలేశ్వరస్వామి, కంబకాయిలో స్వయం భీమేశ్వర ఆలయం. చెన్నాపురాల్లో బుధవారం ముక్కనుమ సందర్భంగా నిర్వహించిన జాతర్లకు జనం పోటెత్తారు. సుదూర ప్రాంతాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో చేరుకుని స్వామిని దర్శించుకుని పునీతులయ్యారు. కంబకాయి గ్రామంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఎటువంటి సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



హళహళేశ్వర స్వామి జాతరలో పాల్గొన్న జనం

రాణలో ముఖలింగేశ్వరుని..



జాతరకు పోటెత్తిన జనం

జలుమూరు: రాణ గ్రామంలో కొలువు తీరిన శ్రీముఖలింగేశ్వరస్వామి జాతర బుధవారం వైభవం గా జరిగింది. ముక్కనుమ పర్వదినం సందర్భంగా శ్రీముఖలింగేశ్వరస్వామి ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఉత్సవ మూర్తులను పల్లకిలో ఆసీనులను చేసి గ్రామోత్సవం నిర్వహించారు. జాతరకు వచ్చిన పలువురు భక్తులు స్వామిని దర్శించుకొని పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పూర్వం నుంచి గ్రామానికి చెందిన తర్ర బప్పాయి కుటుంబానికి చెందిన వారసులు గ్రామస్థుల సహకారంతో జాతర నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. అనంతరం స్వామిని పల్లకిలో యథాస్థానానికి చేర్చారు. ఈ జాతరకు సమీప గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలి వచ్చారు.



అమ్మవారిని దర్శించుకునేందుకు బారులుతీరిన భక్తులు

సందడిగా..

జి.సిగడాం: మదుపాంలో వెలసియున్న దుర్గాదేవి మహోత్స వాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారిని వందలాది మంది భక్తులు దర్శించకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాత్రలలో భాగంగా మూడురోజుల పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గెడ్డకంచరాంలో వెలసియున్న పైడితల్లి అమ్మవారిని రెండో రోజు బుధవారం దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసి సాంస్కృతిక కార్యక్రమాలు అలరించారు. మెట్టవలస ఏకశిలా పర్వతంపై వెలసి యున్న మల్లిఖార్జునస్వామి యాత్ర మహోత్సవాలు బుధవారంతో ముగిశాయి. జి.సిగడాం, పొందూరు, సంతకవిటి, రాజాం తదితర మండలాల నుంచి వేలాది మంది భక్తులు తరలిరావడంతో ఏకశిలాపర్వంత భక్తులతో కిటకిటలాడింది. ఎస్‌ఐ సామంతుల రామారావు అధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నగర సంకీర్తన

సరుబుజ్జిలి: నందికొండ, సరుబుజ్జిలి గ్రామాలతో పాటు సరుబుజ్జిలి జంక్షన్ పురవీధుల్లో బీజేపీ మండల అధ్యక్షుడు వేల్పుల గోవిందరావు ఆధ్వర్యంలో అయోధ్య శ్రీరామ నగర సంకీర్తన నిర్వహించారు. బుధవారం భక్తి గీతాలను ఆలపిస్తూ గ్రామాల్లోని ఇంటింటికి వెళ్లి ఈ నెల 22న ప్రారంభంకానున్న అయోధ్య రామాల యదర్శనానికి ఆహ్వానించడంతో పాటు శ్రీరాముని అక్షింతలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హిందూ సంప్రదాయాలను హైందవ ధార్మిక ధర్మతత్వాన్ని భారతదేశంలో చిరస్థాయిలో నిలవడానికి ప్రధానమంత్రి మోదీ ప్రత్యేక కృషితో రామజన్మస్థలం అయోధ్య రామాలయ నిర్మాణానికి నాంది పలకడం జరిగిందన్నారు. చింతాడ వరహాకృష్ణ, దవ సింహాచలం, పాతిన రామారావు, మన్మధరావు పాల్గొన్నారు.

వైభవంగా ఉమాకామేశ్వరి రథయాత్ర

సరుబుజ్జిలి: పురుషోత్తపురంలో ఉమాకామేశ్వరిస్వామి వారి రథయాత్ర బుధవారం వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను వేదమంత్రాల నడుమ అర్చకులు గంగవరపు వాసుదేవశర్మ, ఆనందశర్మ రథంపైకి తరలించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను గ్రామ పురవీధుల్లో తిరువీధి నిర్వహించారు. అనంతరం తోట జాతర కార్యక్రమం చేపట్టారు. ఈ జాతరకు జలుమూరు, సరుబుజ్జిలి, ఆమదాలవలస మండలాల భక్తులు విశేషంగా తరలివచ్చారు.



స్వామివారి రథయాత్రలో పాల్గొన్న భక్తులు



అయోధ్య రాముడి అక్షింతలు ఊరేగిస్తున్న దృశ్యం

ఇరిగేషన్ ఉద్యోగి మృతి

- మృతిపై అనుమానంతో పోలీసులకు చెల్లెలు ఫిర్యాదు



సతీష్‌కుమార్ (ఫైల్)

శ్రీకాకుళం క్రైం: జిల్లా కేంద్రంలోని ఇరిగేషన్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఓ వ్యక్తి మృతి చెందగా, అతడి అంత్యక్రియలకు సిద్ధమవుతున్న తరుణంలో ఒంటిపై గాయాలు కనిపించాయి. దీంతో అతడి చెల్లెలు అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటన నగరంలో చోటుచేకుంది. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. నగరంలోని బొందిలీపురంలో ఉన్న ఇరిగేషన్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా నారాయణశెట్టి సతీష్‌కుమార్ విధులు నిర్వహిస్తున్నాడు. ఆదివారంపేటలో ఓ అద్దె ఇంట్లో కుటుంబంతో జీవిస్తున్నాడు. బుధవారం ఉదయం సతీష్ మృతి చెందినట్టు దేవాది గ్రామంలో ఉంటున్న అతడి చెల్లెలు మధులతకు సమాచారం అందించారు. దీంతో మధులత తన అన్న ఇంటికి చేరుకుంది. అంత్యక్రియలకు సిద్ధమవుతుండగా పరామర్శకు వచ్చిన ఇరిగేషన్ శాఖ అధికారులు, దేవాది నుంచి కొంతమంది మృతుడి రెండు భుజాలపై రక్తం గడ్డకట్టిన ఆనవాలు ఉండడంతో ముడుకుల నుంచి రక్తం కారిన గాయాలు గుర్తించారు. దీంతో సతీష్ మృతిపై మధులత అనుమానాలు వ్యక్తం చేస్తూ టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ పి.శ్రీనివాసరావు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి, మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి పోస్టుమార్టం చేయించారు. కాగా 2002లో మణితో వివాహం జరిగింది. వీరికి కూమార్తె, కుమారుడు ఉన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

ఎచ్చెర్ల: అరిణాం అక్కివలస గ్రామానికి చెందిన పుంగ్రోతు రామారావు(50) గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మద్యం అలవాటు ఉన్న రామారావును మంగళవారం కుటుంబ సభ్యులు నిలదీయడంతో ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగికి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. భార్య పార్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

బూర్జ: పెద్దపేట గ్రామ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రామన్నపేట గ్రామానికి చెందిన లావేటి నవీన్, పాలవలస గ్రామానికి చెందిన అల్లుబోయిన చంద్రశేఖర్ ద్విచక్ర వాహనంపై పాలకొండ వైపు వెళ్తుండగా అంబులెన్స్ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఎస్‌ఐ అశోక్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరి కుప్పలు దగ్ధం

రణస్థలం: పిషిని గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు వరి కుప్పలకు నిప్పు పెడుతున్నారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికొచ్చిందని ఎంతో ఆనందంతో దిబ్బలు పెట్టుకుంటే కొంత మంది ఆకతాయలు నిప్పుపెడుతున్నారు. బుధవారం లక్ష్మణరావుకు చెందిన వరి కుప్పకు నిప్పుపెట్టారు. దీన్ని గుర్తించిన సమీపంలో ఉన్న రైతులు స్పందించి మంటలను అదుపు చేశారు. కొంత వరకు వరి కుప్ప అగ్నికి ఆహుతి అయింది. ఇదిలావుంటే గత వారం రోజులుగా త్రినాథ్, జి.అచ్చారావు, జి.అప్పలనాయుడుతోపాటు మరో 10 మంది రైతులకు సంబంధించిన వరి కుప్పలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. దీంతో లక్షలాది రూపాయల విలువ చేసే వరి కుప్పలు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ మేరకు రైతులు జేఆర్ పురం పోలీసుకు బుధవారం ఫిర్యాదు చేశారు.

పాన్‌షాప్‌లో చోరీ

పలాస: స్థానిక ఎంపీడీవో కార్యాలయం రోడ్డులో కె.శ్రీరాములు అనే వ్యాపారికి చెందిన పాన్‌షాప్‌లో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. తాళాలు విరగ్గొట్టి షాప్‌లో ఉన్న రూ.5 వేల నగదుతో పాటు రూ.15 వేలు విలువ చేసే వస్తువులు దొంగిలించినట్లు బాధితుడు కాశీబుగ్గ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశాడు. బుధవారం ఉదయం షాపు తెరిచేందుకు రాగా తాళాలు పగులగొట్టి ఉందని, నగదు, వస్తువులు మాయం అయినట్లు గుర్తించి ఫిర్యాదు చేశారన్నారు. సీసీ పుటేజీను పోలీసులు పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.

ఫరీద్‌పేటలో బైక్..

ఎచ్చెర్ల: బైక్ చోరీపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఫరీద్‌పేట జంక్షన్‌లో నివాసం ఉంటున్న ఆర్మీ ఉద్యోగి సత్తారు మనోహర్ ఇటీవల సెలవుపై ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో తన ఇంటి ముందు పార్క్ చేసిన బైక్ మంగళవారం రాత్రి అపహరణకు గురైంది. దీంతో బుధవారం పోలీసుకు ఫిర్యాదు చేశారు. సీసీ పుటేజీలో బైక్ చోరీని గుర్తించారు.

ఇరువర్గాల ఘర్షణ.. 16 మందిపై కేసు నమోదు

టెక్కలి రూరల్: టెక్కలి పట్టణంలోని ఆది ఆంధ్రావీధి, కోదండరామ వీధులకు చెందిన ఇరువర్గాల మధ్య బుధవారం ఘర్షణ చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ఆది ఆంధ్రావీధికి చెందిన ఒక యువకుడు, కోదండరామ వీధికి చెందిన యువకుడి మధ్య స్థానిక చేపల మార్కెట్‌లో వాగ్వాగం చేసుకుని ఇరువర్గాల ఘర్షణకు దారి తీసింది. ఈ నేపథ్యంలో ఆదిఆంధ్రావీధికి చెందిన పలువురు యువకులు కోదండరామ వీధికి వెళ్లి గొడవకు దిగారు. ఈ నేపథ్యంలో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం సంభవించింది. దీనిపై ఇరువర్గాల ఫిర్యాదు మేరకు ఆది ఆంధ్రావీధికి చెందిన దండాసి లోవరాజుతో పాటు 10 మందిపై, కోదండరామ వీధికి చెందిన కొమ్ము దిలీప్‌కుమార్‌తో పాటు మరో నలుగురిపై, మొత్తం 16 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ-2 కె రమేష్‌బాబు తెలిపారు.

అవయవదాతకు కన్నీటి వీడ్కోలు



పార్థివదేహంతో ర్యాలీగా వెళ్తున్న దృశ్యం



రవికుమార్ (ఫైల్)

శ్రీకాకుళంక్రైం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ యువకుడు బ్రెయిన్ డెడ్ కాగా.. ముగ్గురుకి అవయవదానం చేసి ప్రాణదాతగా నిలిచాడు. నందిగాం మండలం మడిగపురం గ్రామానికి చెందిన రోణంకి రవికుమార్(28) ఈ నెల 10వ తేదీన ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తెండగా బెండి గేటు వద్ద వ్యాన్ ఢీ కొట్టింది. దీంతో రవికుమార్‌కు తీవ్ర గాయాలు కావడంతో శ్రీకాకుళంలోని మెడికవర్ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతున్న రవి 17వ తేదీన బ్రెయిన్ డెడ్ అయినట్టు వైద్యులు నిర్ధారించారు. దీంతో అతడి తల్లిదండ్రులు నారాయణరావు, నారాయణమ్మలకు విషయం తెలిపి, అవయవదానంపై అవగాహన కల్పించారు. దీనికి వారు అంగీకరించడంతో జెమ్స్ ఆస్పత్రికి రవికుమార్‌ను తరలించారు. జీవన్‌ధాన్ ద్వారా అతడి కళ్లు రెడ్‌క్రాస్‌కు, లివర్, కిడ్నీలు విశాఖలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అవయువదాత రవికుమార్ పార్థివ దేహాన్ని ఆసుపత్రి చుట్టూ ర్యాలీగా తీసుకువెళ్లి వైద్యులు, సిబ్బంది, కుటుంబ సభ్యులు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అతని కుటుంబ సభ్యులకు అవయువదాన ధ్రువపత్రాన్ని అందజేశారు. అవయువదానానికి ఆపరేషన్ చేసిన వారిలో వైద్యులు సుధీర్, శ్రీనివాసులు, లక్ష్మి లలిత, అశోక్ రెడ్డి, బాలమురళి, ప్రవీణ్, జ్యోత్స్న తదితరులు ఉన్నారు.

ఒకేచోటకు నాలుగు తరాలు



రామజోగినాయుడి కుటుంబ సభ్యులు

ఆమదాలవలస: కనుగులవలస గ్రామంలో నాలుగు తరాలకు చెందిన సుమారు 200 మంది కుటుంబ సభ్యులు ఒక్కచోటకు చేరి సందడిగా గడిపారు. గ్రామంలో డీసీసీబీ మాజీ డైరెక్టర్ బొడ్డేపల్లి రామజోగినాయుడు శతజయంతి వేడుకలు బుధవారం కుటుంబ సభ్యులు నడుమ నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో రాష్ట్ర సహాధ్యక్షుడు చౌదరి పురుషోత్తంనాయుడు, డీసీసీబీ డైరెక్టర్ బొడ్డేపల్లి నారాయణరావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. కాగా రామజోగినాయుడికి ఐదుగురు కుమారులు, ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. వీరిలో ఒక కుమారుడు మృతి చెందాడు.

'రైతు బందు' విజయవంతం చేయండి

ఇచ్ఛాపురం: మఖరాంపురం జంక్షన్ వద్ద ఈ నెల 24న తలపెట్టనున్న రైతు బందు సమావేశం విజయవంతం చేయాలని నియోజకవర్గ రైతు కుల కన్వీనర్ జన్నెల ప్రసాద్ పిలుపు నిచ్చారు. బుధవారం బెల్లుపడ జామిఎల్లమ్మ గుడి వద్ద నియోజకవర్గ స్థాయి రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు ఎదుర్కొంటున్న ప్రతీ సమస్యను పరిష్కరించే దిశగా అడుగులు వేద్దామన్నారు. వంశధార నది నుంచి బాహుదానది వరకు సాగునీరు తెచ్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. ఉద్దానం ప్రాంతంలో కొబ్బరి, జీడి, మామిడి దరల స్థిరీకరణ కోసం, అనతరం రైతు బందు సమావేశానికి సంబంధించిన వివిధ రకాల కమిటీలు వేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ ఎస్పీ ఎస్వీవీ ప్రసాదరావు, కామేష్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు నర్తు నరేంద్రయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలపై దృష్టి



మాట్లాడుతున్న సీఐ ఇమ్మాన్యువల్

ఇచ్ఛాపురం: రానున్న ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు గ్రామస్థాయిలో ప్రజలతో సమావేశాలు ఏర్పాటు చేసి అవగహన కల్పిస్తామని సీఐ ఇమ్మాన్యువల్ రాజు అన్నారు. బుధవారం సర్కిల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. క్రైమ్‌ను పూర్తిస్థాయిలో తగ్గించేందుకు ప్రధాన జంక్షన్లలో సీసీ కెమారాలు ఏర్పాటు చేస్తామన్నారు. అతివేగంగా నడిపే వాహనాలపై దృష్టి సారించి, ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ట్రిబుల్ రైడింగ్, లైసెన్సులు లేకుండా వాహనాలు నడిపే వారిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. గతంలో ఇచ్ఛాపురం టౌన్, రూరల్ పోలీస్ స్టేషన్లలో ఎస్‌ఐగా విధులు నిర్వహించానని, ఇక్కడి ప్రజలపై ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. పేకాట శిబిరాలపై, చట్ట విరుద్ధమైన కార్యకలాపాలపై చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్‌బీఐ రోడ్డులో ట్రాఫిక్ నియంత్రణపై దృష్టిసారించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ఎస్‌ఐ గోవిందరావు, కవిటి ఎస్‌ఐ రాము పాల్గొన్నారు.

వేడుకగా హనుమత్ దర్శనోత్సవం

ఇచ్ఛాపురం: కోదండ రామస్వామి ఆలయంలో ముక్కనుమ పురస్కరించుకొని హనుమత్ దర్శనోత్సవ వేడుకలు బుధవారం శాస్త్రోక్తంగా ఘనంగా నిర్వహించారు. త్రేతాయుగంలో హనుమాన్‌కు ఇచ్చిన వరం ప్రకారం కలియుగంలోనూ శ్రీరామ క్షేత్రల్లో జరుగుతున్నాయని వేదపండితులు రామప్రసాద్ సిద్దాంతి అన్నారు.

'ఆడుదాం ఆంధ్రా'లో కొట్లాట

- కబడ్డీ క్రీడాకారుడికి గాయాలు



కొట్లాడుకుంటున్న క్రీడాకారులు

శ్రీకాకుళం స్పోర్ట్స్: శ్రీకాకు ళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో బుధవారం జరిగిన మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో కొట్లాట చోటుచేసుకుంది. ఈ పోటీల్లో భాగంగా పెద్దపాడు, రిమ్స్‌రోడ్ జట్ల మధ్య కబడ్డీ పోటీ జరిగింది. పెద్దపాడు క్రీడాకారుడు కూతకు వెళ్లి పాయింట్ సాధించే సమయంలో ఇరుజట్ల క్రీడాకారుల మధ్య గొడవ జరిగింది. రిమ్స్ రోడ్ క్రీడాకారుని ముక్కుపై బలమైన గాయం కావడంతో రక్తం వచ్చింది. దీనిపై బాధిత క్రీడాకారులు పోలీసులను ఆశ్రయించారు. అధికారులు రంగంలోకి దిగి కేసు కట్టకుండా ఆపేందుకు ప్రయత్నించారు. గాయపడిన క్రీడాకారుడికి చికిత్స చేయించారు.

విద్యాభివృద్ధితోనే ప్రగతి

ఎచ్చెర్ల: విద్యా రంగం అభివృద్ధితోనే ప్రగతి సాధ్యమని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ నిమ్మ వెంకటరావు అన్నారు. వర్సిటీలో బుధవారం రాష్ట్ర ఉన్నత విద్యా మండలి, వర్సిటీ సంయుక్తంగా ఏపీ పాఠశాల విద్య, సంస్కరణలు, ఆవిష్కరణలు, మేథోసంపత్తి హక్కులు అనే అంశంపై నిర్వహించిన వర్క్‌షాపులో ఆయన మాట్లాడారు. ఎటువంటి అభివృద్ధికైనా విద్య మూలమన్నారు. పేదరికం, నిరక్షరాస్యత తదితర అంశాలు సమాజాభివృద్ధికి అడ్డంకిగా నిలుస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కేంద్ర శాస్త్ర సాంకేతిక విభాగం ఎన్‌ఆర్‌డీసీ సీనియర్ రీజనల్ మేనేజర్ బీకే సాహు. వర్సిటీ రిజిస్ట్రార్ బిడ్డిక అడ్డయ్య, ప్రిన్సిపాల్స్ ఎస్.ఉదయభాస్కర్, సీహెచ్ రాజశేఖరరావు, హానరీ ప్రొఫెషర్ తమ్మినేని కామరాజు, వివిధ విభాగాల డీన్లు పీలా సుజాత, ఎం.అనూరాధ, కె.స్వప్నవాహిని, జేఎన్‌టీయూ పాలకమండలి సభ్యుడు బుడుమూరు రాజేష్, వర్సిటీ ప్లేస్‌మెంట్‌అధికారి కె.విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు. కాగా బీఆర్‌ఏయూ వీసీగా మూడేళ్ల పదవీ కాలం పూర్తిచేసుకున్న సందర్భంగా ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావుని వర్సిటీ బోధనా, బోధనేతర సిబ్బంది ఘనంగా సత్కరించారు.

వచ్చే నెల 18 నుంచి కమ్మసిగడాం జాతర

రణస్థలం: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు కమ్మసిగడాం మహాలక్ష్మి తల్లి జాతర ఫిబ్రవరి 18వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జరగనున్నదని ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి నడుకుదిటి ఈశ్వరరావు స్పష్టం చేశారు. బుధవారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో సర్వసభ్య సమావేశం జరిగింది. జాతర సక్రమంగా జరిగేవిధంగా, అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా జాతర కమిటీని ఏర్పాటు చేశారు. ఆదేవిధంగా జాతర మూడు రోజుల పాటు భక్తుల వినోదం కోసం ఏర్పాటు చేయనున్న సాంస్కృతిక కార్యక్రమాలపై చర్చించారు. కార్యక్రమంలో కిమిటీ సభ్యులు వెలిచేటి రామకృష్ణ, వెలిచేటి రాజరవిచంద్ర, వి.తేజ, వి.రాజశేఖర్, రాయుడు, మన్నె లక్ష్మీప్రసాద్, వి.మురళీ, సీహెచ్‌వీ రాజేష్, ఎం.కృష్ణానందం తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేయాలి

కలెక్టరేట్: సార్వత్రిక ఎన్నికలకు గాను జిల్లాలో ఏర్పాటు చేసిన అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను ఈ నెల 25 నాటికి పూర్తి చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ నవీన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో చేయాల్సిన ఏర్పాట్లపై కలెక్టరేట్‌లో బుధవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 2,357 పోలింగ్ కేంద్రాలకు గాను 711 కేంద్రాల్లో ఏర్పాట్లు ఇంకా సంతృప్తికరంగా లేవని గుర్తించామని, ఆయా కేంద్రాల్లో ఫర్నీచర్, తాగునీరు, మరుగుదొడ్లు, వికలాంగులకు వీలుగా ర్యాంపుల ఏర్పాటు, విద్యుత్తు సరఫరా, తదితర లోటుపాట్లు ఉన్నట్టు గుర్తించామన్నారు. సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులకు ఎటువంటి కష్టం కలుగకుండా ఓటు వేసేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఎన్నికల నిర్వహణను బాధ్యతాయుతంగా నిర్వహించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డీఆర్వో ఎం.గణపతిరావు, ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ, ఎస్ఎస్ఏ అధికారి జయప్రకాష్, పంచాయతీరాజ్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

22న ఓటర్ల తుది జాబితా ప్రచురణ



మాట్లాడుతున్న డీఆర్వో గణపతిరావు

కలెక్టరేట్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ముసాయిదా ఓటర్ల జాబితా పరిశీలన పూర్తయిందని, ఈ నెల 22న ఓటర్ల జాబితా ప్రచురణ ఉంటుందని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు తెలిపారు. రానున్న ఎన్నికలకు సంబంధించి పోలింగ్ శాతం పెంచేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. బుధవారం తన చాంబర్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో 28వ వారపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ.. డిసెంబరు 9వ తేదీ వరకు వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలన పూర్తి చేశామని, వాటితో సంబంధం లేకుండా ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేవరకు దరఖాస్తు చేసుకునే వారి దరఖాస్తుల మార్పులు, చేర్పుల ప్రక్రియను నిరంతరం కొనసాగిస్తామని అన్నారు. కార్యక్రమంలో కొమ్మనాపల్లి వెంకటరామ రాజు (టీడీపీ), పి.సురేష్‌బాబు (బీజేపీ), ఎస్.సత్యనారాయణ (వైసీపీ), సోమేశ్వర రావు (బీఎస్పీ) తదితరులు పాల్గొన్నారు.

కక్షపూరిత ధోరణితోనే అక్రమ అరెస్టులు

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్

గుజరాతీపేట: కక్షపూరిత ధోరణితోనే తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబును అక్రమ అరెస్టులు చేశారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ కూన రవికుమార్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్కిల్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో సెక్షన్ 17ఎ అవినీతి నిరోధక చట్టం 1988 ఈ కేసుకు వర్తిస్తుందా లేదా అనే దానిపై ఇద్దరు న్యాయమూర్తులు విభిన్న అభిప్రాయాలను తెలియజేశారని, తర్వాత ప్రధాన న్యాయమూర్తికి నివేదించడం జరిగిందన్నారు. ఇందులో కొన్ని ఆసక్తికరమైన విషయాలు వెలువడ్డాయన్నారు. లీడ్ న్యాయమూర్తులు స్పష్టం చేసిన ఈ విషయాలను కప్పిపుచ్చి వైసీపీ, దాని అనుబంధ సంస్థగా మారిన సీఐడీ వారు, చర్యలను సుప్రీంకోర్టు న్యాయమూర్తులు సమర్థించారని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ఈ అక్రమ కేసుల్లో ఎక్కడా గౌరవ హైకోర్టు ఒక్క వ్యతిరేక వ్యాఖ్యను కూడా చేయకపోవడం ఈ కేసులు రాజకీయ ప్రేరేపితమని చెప్పడానికి నిదర్శనమన్నారు. చంద్రబాబుకు డబ్బు చేరిందని, కనీసం పోయిందని కూడా సీఐడీ ఆధారాలు చూపించలేకపోయిందన్నారు. పార్టీకు వచ్చిన సభ్యత్వ రుసుం అక్రమ నిధులుగా చూపించారనే ప్రయత్నాన్ని కూడా తెలుగుదేశం సాక్ష్యాధారాలతో తిప్పికొట్టిందన్నారు. ఇప్పటి వరకు వందల మంది అధికారులు, కోట్ల రూపాయలు తీసుకున్న న్యాయవాదులు, ఐదేళ్లగా సిట్‌లు, దర్యాప్తులు, అరెస్టులేకానీ ఒక్క కేసులో కూడా చార్జీషీట్ వేసే సత్తా ఈ ప్రభుత్వానికి గాని, తాబేదారైన సీఐడీకు లేదన్నారు. ఇది కేవలం కక్షపూరిత ధోరణితోనే ఇటువంటి చర్యలకు పాల్పడుతుందని మండిపడ్డారు. దీనికి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

బాధితుడికి సాయం

జి.సిగడాం: అనారోగ్యంతో బాధపడుతున్న శేతుభీమవరం గ్రామానికి చెందిన సిద్ధాపు అప్పన్నకి పెన సాం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు కుదిరెళ్ల బుజ్జి బుధవారం రూ.10 వేలు వితరణగా అందజేశారు. అలాగే పెనసాం, శేతుభీమవరం, గంగన్నదొరపాలెం తదితర గ్రామాలకు చెందిన సుమారు 600 మంది నిరుపేదలకు దుస్తులు అందజేశారు. ఈయన వెంట టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, యువకులు, గ్రామపెద్దలు ఉన్నారు.

నేడు 'సామాజిక సమతా సంకల్పం'

కలెక్టరేట్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 'సామాజిక న్యాయ మహాశిల్పం' ఆవిష్కరణ సందర్భంగా గురువారం ఉదయం 10 గంటలకు అంబేడ్కర్ విగ్రహానికి పుష్పమాలలతో అంకరణ, మానవహారం, మధ్యాహ్నం 3.30 గంటలకు అంబేడ్కర్ ఆడిటోరియంలో సామాజిక సమతా సంకల్పం సమావేశం నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ శ్రీకేష్ బి.లఠ్కర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు, అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

విగ్రహావిష్కరణను విజయవంతం చేయండి

కలెక్టరేట్: అమరావతిలో ఈ నెల 19న నిర్వహించనున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో జిల్లా ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఎస్సీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ ఎం.విక్టర్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. విజయవాడలోని స్వరాజ్ మైదానంలో ఏర్పాటు చేసిన 125 అడుగుల విగ్రహావిష్కరణకు అంతా హాజరుకావాలన్నారు. దీనికి సంబంధించి బుధవారం స్థానిక ఆర్ అండ్ బీ అతిథిగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రెండు వేల కోట్ల రూపాయల విలువ గల భూమిలో 125 అడుగుల ఎత్తు కలిగిన అంబేడ్కర్ విగ్రహాన్ని రూ.400 కోట్లతో నిర్మించినట్టు తెలిపారు. సమావేశంలో సాంఘిక సంక్షేమశాఖ ఏడీ విశ్వమోహన్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, ప్రిన్సిపాల్స్ దేవేందర్‌రావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు. కాగా ఎస్సీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ ఎం.విక్టర్ ప్రసాద్‌ను ఇన్‌చార్జ్ కలెక్టర్ ఎం.నవీన్ బుధవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

'విగ్రహావిష్కరణంటూ మోసం'

అరసవల్లి: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బడుగు, బలహీన వర్గాలకు కల్పించిన ప్రాథమిక హక్కులను కాలరాచిన వైసీపీ ప్రభుత్వం ఇప్పుడు అంబేడ్కర్ భారీ విగ్రహాన్ని ఆవిష్కరించే కార్యక్రమంతో దళితులను మోసగించడమేనని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పీఎంజే బాబు అన్నారు. బుధవారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో దళితులకు అమలు చేసిన అన్ని సంక్షేమ పథకాలను రద్దు చేసి, విదేశీ విద్యా పథకానికి గల అంబేడ్కర్ పేరును తొలగించి వైఎస్ఆర్ విదేశీ విద్యా పథకంగా మార్పు చేయడం అంబేడ్కర్‌ను అవమానించడం కాక మరేమిటని ప్రశ్నించారు.

ప్రభుత్వ పాఠశాలలో అగ్నిప్రమాదం



టెక్కలి రూరల్: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠ శాలలో బుధవారం అగ్ని ప్రమాదం సంభవించింది. పాఠ శాల స్టోర్ రూం నుంచి పెద్దఎత్తున మంటలు రావడంతో స్థానికులు సమీపంలో ఉన్న అగ్ని మాపక కేంద్రానికి సమాచారం అందించారు. టెక్కలి అగ్నిమాపక అధికారి ఎస్.మల్లేశ్వరరావు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ అగ్ని ప్రమాదంలో పాఠశాలకు చెందిన పాతపుస్తకాలతో పాటు ఓపెన్‌స్కూల్‌కు చెందిన పాత రికార్డులు కాలిపోయాయి. అయితే విద్యుత్ సరఫరా కూడా లేని స్టోర్ రూంలో మంటలు ఎలా వ్యాపించాయో తెలియరాలేదని అగ్నిమా పక సిబ్బంది, పాఠశాల సిబ్బంది చెబుతున్నారు. మంటల దాటికి పక్క గదుల్లో ఉన్న విద్యుత్ వైర్లు దెబ్బతిన్నా యని హెచ్ఎం డి.నాగభూషణం తెలిపారు. అగ్నిప్రమా దానికి ఆకతాయిల చేష్టలే కారణమై ఉండవచ్చని పలువురు స్థానికులు అంటున్నారు.

పక్కాగా ఏర్పాట్లు చేయాలి

ఇచ్ఛాపురం: రానున్న ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ స్టేషన్ల వద్ద ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా పక్కాగా ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆర్డీవో ఎస్.భరత్‌నాయక్ సూచించారు. బుధవారం నాలుగు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంఈవోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని పోలింగ్ స్టేషన్లు పరిశీలించి ర్యాం పులు, టాయిలెట్స్, తాగునీరు, ఎలక్ట్రికల్ ఫర్నీచర్ వంటివి సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 31లోపు అన్ని పోలింగ్ స్టేషన్లు సిద్ధం చేయా లన్నారు. ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ఈ నెల 24 నుంచి అత్యంత ప్రతిష్టాత్మ కంగా నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇచ్ఛాపురం తహసీల్దార్ ఎస్.గు రుప్రసాద్, డీటీ శ్రీహరితో పాటు అన్ని మండలాల అధికారులు పాల్గొన్నారు.